# రెక్కల హరివిల్లు

దసరా పండక్కి నాలుగు రోజులు శెలవలిస్తారని విన్న క్షణం నుంచీ నా మనసుకి రెక్కలు మొలిచాయి. ఎపుడెపుడు యింటికెళ్ళిపోతానా అన్న ఆరాటం... అమ్మానాన్నల్తో పాటు అస్తమానం గుర్తొచ్చే మాతోటలోని పూలని పల్కరించి ఎన్నాళ్ళయిందో... పూలరెక్కల సీతాకోక చిలుకల్ని పరామర్శించాలన్న తహతహ... జైల్లాంటి మా హాస్టల్ చుట్టూతా ఉన్న ఎత్తైన ప్రహరీగోడ మీంచి ఎగిరెళ్ళి మా తోటలో వాలిపోవాలన్న కోరిక...

సీతాకోక చిలుక... ఎంతందమైన పేరు! దాని సోయగమంతా రంగురంగుల రెక్కల్లో దాచుకుని పూలవనాలమీద ఎగుర్తుంటే చూట్టం ఎంత తీయటి అనుభవమో...

నా చిన్నప్పుడు మా పెరట్లో సన్నజాజి పందిరి ఉండేది. చాలా రాత్రుళ్ళు అమ్మ ఆ పందిరి కిందనే మంచం వేసి నేను పడుకునే వరకు కబుర్లు చెప్పేది... కమ్మటి కథలు విన్పించేది.

అప్పుడే మొదటిసారి సీతాకోక చిలుకని చూట్టం...

'దాని రెక్కలు చూశావా ఎంత బావున్నాయో... దాన్ని సీతాకోక చిలుక అంటారు. బటర్ఫ్లయ్... ఎన్ని రంగుల్లో చూడు! ఎరుపు... పసుపు... నలుపు... నీలం' అంది అమ్మ.

'ఎందుకొచ్చింది?'

'మన సన్నజాజి తీగకు బోల్డన్ని పూలు పూశాయి కదా... వాటికోసం వచ్చింది. పూలెక్కడ ఉంటే సీతాకోక చిలుకలు అక్కడ వాల్తాయి'

దాని సౌందర్యం నా మనోఫలకం మీద రంగురంగుల జ్ఞాపకాల పాదముద్రల్ని వదిలేసి వెళ్ళింది.

ఓ రోజు సాయంత్రం వేళ మిగతా పిల్లల్తో కలిసి ఆడుకుంటున్న సమయంలో నా భుజం మీద వాలి మెల్లగా రెక్కల్ని కదిలిస్తోంది. నాకు కొద్దిగా భయంతో పాటు ఆనందం కలిగింది. వేగంగా నడిస్తే ఎగిరిపోతుందేమోనని, మెల్లగా అడుగులో అడుగేస్తూ యిల్లు చేరి, అమ్మకు చూపించాను.

'పూలమీదే వాల్తుందన్నావుగా... మరి నామీద వాలిందెందుకు?' అని అడిగా... దాని రెక్కలు చాలా పెద్దగా ఉన్నాయి. వాటినిండా ఎర్రటి నల్లటి చుక్కలు... నక్షత్రాలు పొదిగిన ఆకాశంలా...

'నువ్వు కూడా పువ్వులా ఉంటావుకదా... అందుకే మురిసిపోయి నీ మీద వాలింది' అంది అమ్మ నా బుగ్గలు పుణుకుతూ...

అమ్మ అలా అంటే ఎంత సంతోషం అన్పించిందో.... కిలకిలా నవ్వితే 'చూశావా... సన్నజాజులు రాలినట్లు ఎంతందంగా ఉందో నీ నవ్వు... మరిన్ని సీతాకోక చిలుకలు వచ్చి వాల్తాయేమో చూడు' అంది అమ్మ. నేను నవ్వినప్పుడు కదిలినందువల్లనేమో అది ఎగిరి వెళ్ళిపోయింది.

చిననాటి జ్ఞాపకాలు బలంగా నాటుకుపోవటం వల్లనుకుంటాను ఆరో తరగతి నుంచే మా పెరట్లో రకరకాల పూలమొక్కలు పెంచటం యిష్టమైన వ్యాపకంగా మారింది. అమ్మకూ మొక్కలంటే యిష్టమే. మా పెరట్లో సన్నజాజి, చామంతి, బంతి, కనకాంబరం, గులాబి, మల్లె... ఒకటనేమిటి రకరకాల రంగురంగుల మొక్కలు...

వసంత రుతువులో చూడాలి ఆ శోభని... రెండు కళ్ళూ చాలేవి కావు. రంగు రంగుల పూలు... రంగు రంగుల రెక్కల్తో ఎగిరే సీతాకోక చిలుకలు... కదుల్తోన్న పువ్వుల్లా... అన్ని రంగులూ ఒలికిపోయిన కాన్వాస్‌లా తోట...

చదివి చదివి అలసిపోయినపుడు తోటలోకెళ్ళి పదినిముషాలు గడిపితే చాలు ఉత్సాహం ఉరకలు వేసేది. సౌందర్యంలో అనంతమైన శక్తి నిబిడీకృతమై ఉంటుందని నాకర్థమైంది అప్పుడే.

పదో తరగతి పాసైనాక, అమ్మ వద్దంటున్నా వినకుండా విజయవాడలోని కార్పొరేట్ కాలేజీలో చేర్పించాడు నాన్న. బై.పి.సి గ్రూప్... హాస్టల్ బతుకు దుర్భరంగా అన్పిస్తోంది. ఏటు చూసినా పచ్చదనమే కన్పించదు. విశాలమైన ప్రాంగణం... కుర్చీలు, బల్లలు... క్లాస్

రెక్కల హరివిల్లు

రూంలు... పుస్తకాలు... చదువు చెప్పే మాష్టార్లు...పరీక్షలు, మార్కులు, ర్యాంకులు.... యిరవై నాలుగు గంటలూ కళ్ళ ముందు యివే దృశ్యాలు మారి మారి కదుల్తుంటాయి.

హాస్టల్‌కొచ్చి మూడు నెలలు కావస్తోంది. మావూరు బాగా జ్ఞాపకం వస్తోంది. మా తోట... అందులోని పూల మొక్కలు... సీతాకోక చిలుకలు... నా నేస్తాలు సునీల్, కుమార్...

సునీల్ వాళ్ళ నాన్న బేల్దారీ పని చేస్తాడు. ఆర్థిక మాంద్యం వల్ల యిల్లు కట్టుకునేవాళ్ళ సంఖ్య బాగా తగ్గిపోయి అతనికి పని లేకుండా పోయింది. చదివించే స్థోమత లేక సునీల్ని చదువు మాన్పించేసి, పొలం పనులకు పంపిస్తున్నాడు. కుమార్ మా వూళ్లోనే ఉన్న గవర్నమెంట్ జూనియర్ కాలేజీలో కామర్స్‌లో జాయినయ్యాడు.

రేపట్నుంచే శెలవలు...

యింటికి వెళ్ళగానే మొదట చేసిన పని మా తోటలోకెళ్ళి పూలని పరామర్శించటం... అవి మెల్లగా తలలూపుతూ 'బావున్నావా' అంటూ పరామర్శించిన అనుభూతి... వాటి మృదుస్పర్శ అమ్మ స్పర్శలా ఎంత హాయిగా ఉందో... పూరేకుల్ని వేళ్ళతో తడిమితే, కౌగిట్లో యిమిడిపోయే పసిపాపల్లా నా వేలి కొసల్ని హత్తుకుంటున్న అనుభూతి...

తోటంతా వెతికినా ఒక్క సీతాకోక చిలుక కూడా కన్పించలేదు. ఎంత నిరాశ పడ్డానో...

"అమ్మా... సీతాకోక చిలుకలు ఎప్పట్లానే వస్తున్నాయిగా" అని అడిగా.

"ఈ మధ్య కాలంలో కన్పించలేదురా. నీమీద బెంగెట్టుకుని, నువ్వు లేని తోటలోకి రావటం యిష్టంలేక మానేశాయేమో" అంది అమ్మ మురిపెంగా నవ్వుతూ...

సీతాకోక చిలుకలు రావటం లేదని పూలన్నీ బెంగెట్టుకుంటాయేమోనన్న దిగులు...రాత్రంతా కలత నిద్ర... సీతాకోక చిలుకలు ఎందుకు రావటం లేదో... ఏమై పోయాయో... కొన్ని పక్షులు వలస పోయినట్లు యివి కూడా ఎటుకైనా ఎగిరెళ్ళి ఉంటాయా... అవి జట్టుగా ఎగరవుగా... మరి ఏమైనట్లు... మా తోటలోకే రావటంలేదా... అమ్మ చెప్పినట్లు అలకా... ఆ ఆలోచనకు నవ్వొచ్చింది. నిజం కాకున్నా ఎంతందమైన వూహ... వాటి అందమైన రంగు రంగుల రెక్కల్లా...

మరునాడుదయం కుమార్ యింటికెళ్ళాను. పిచ్చాపాటి మాట్లాడుకున్నాక "పదరా...

సునీల్‌ని కలిసొద్దాం" అన్నాను.

"సునీల్ని పట్టుకోవటం కష్టంరా... ఎక్కడని వెతుకుదాం" అన్నాడు.

"అదేంటి? ఉంటే యింట్లో ఉంటాడు లేదంటే ఎవరి పొలంలోనో పన్చేస్తుంటాడు. వాడ్ని వెతకటం ఎంత సేపు?"

"సునీల్ యిప్పుడు పొలం పన్లకు పోవటం లేదు. సీతాకోక చిలుకల్ని పట్టుకునే పనిలో బిజీ. బాగా సంపాదిస్తున్నాడు తెలుసా... ఒక్కో సీతాకోక చిలుక్కి పాతిక రూపాయలు."

వాడు చెప్తున్నదేమిటో అర్థంకాక అయోమయంగా చూశాను. "సీతాకోక చిలుక్కి పాతిక రూపాయలేమిట్రా? వాటినెవరు కొంటారు? ఏం చేస్కుంటారు?"

"ఓ... నీకు తెలీదు కదూ... మూణ్ణెల్లుగా నీవు మనూర్లో లేవుగా. ఆయుర్వేద గుళికలమ్మే పాపారావ్ తెల్సుగా?"

"మార్కెట్లో దొరికే చ్యవనప్రాశ లేహ్యంలో ఏవోవే కలిపి, వూరపిచ్చుక లేహ్యాలంటూ జనాల్ని మోసం చేసే పాపారావేనా?"

"అతనే... సీతాకోక చిలుకల రెక్కల్ని పొడిగా చేసి వాటి ధూపాన్ని పీలిస్తే జ్ఞాపక శక్తి అమోఘంగా పెరుగుతుందని, అదృష్టం కలిసొచ్చి లాటరీ తగుల్తుందని, లక్ష్మీదేవి వాళింట్లో తిష్ఠ వేస్తుందనీ ప్రచారం చేశాడు. రోజూ అతనింటి ముందు చాంతాండంత క్యూ ఉంటోంది తెలుసా? ప్రజలు వేలం వెర్రిగా కొంటున్నారు. పొడిగా చేసిన ఓ రెక్కని యాభై రూపాయలకమ్ముతున్నాడు. మనూళ్ళో బేకారుగా తిరిగే కుర్రోళ్ళందరికీ యిపుడు వ్యాపకం సీతాకోక చిలుకల్ని పట్టుకుని పాపారావుకి అమ్మటమే"

"ఎంత మూర్ఖత్వం! మనూళ్ళో యింత మంది చదువుకున్నోళ్ళు ఉండి కూడా యింతటి దారుణం జరుగుతుంటే ఎలా వూర్కుంటున్నారు? రెక్కలు కాలిస్తే మిగిలేది బూడిదే కదరా... దాని వల్ల జ్ఞాపక శక్తి పెరగటమేమిటి?"

కుమార్ కొద్దిసేపు మౌనంగా ఉండి, లోగొంతుకతో అన్నాడు. "నువ్వు కోప్పడనంటే నేనో మాట చెప్తారా... మొన్న ఓ పరీక్ష ముందు నేను కూడా ఆ పొగని పీల్చాను. పరీక్ష బాగా రాశాను తెలుసా... నిజంగానే అందులో ఏదో మహత్తు ఉంది" అన్నాడు.

వాడి మాటలు విన్నాక చాలా బాధేసింది. యింత మంది బాబాలు, స్వామీజీలు,

మంత్రగాళ్ళు, తంత్రగాళ్ళు, మాయగాళ్ళు మనగలుగుతున్నారంటే కారణమేంటో అవగతమైంది. ఒకడు కాలితో తన్ని రోగాలు నయం చేస్తానంటాడు. మరొకడు గాలి పూదితే చాలు రోగం మటుమాయం అంటాడు. ఒకడు తనే సాయి స్వరూపమంటాడు. మరొకడు తన అరచేతిలో సాయిబాబా కన్పిస్తాడని ప్రజల్ని నమ్మిస్తాడు. ప్రజలు వెర్రిగా వాళ్ళని నమ్మి డబ్బుతో పాటు ఆరోగ్యాన్ని పోగొట్టుకుంటున్నారు.

నాకో అనుమానమొచ్చింది. సీతాకోక చిలుకల రెక్కల్ని ఎండబెట్టి ధూపంగా పీలిస్తే అద్భుతాలు జరుగుతాయని నమ్మినా పాపారావు దగ్గరే ఎందుకు కొంటున్నారు? సునీల్ లాంటి వాళ్ళు నేరుగానే అమ్మొచ్చుగా... అదే విషయం అడిగాను.

"వాటిని పొడిగా చేశాక అందులో ఏదో మూలిక కలిపితేనే వాటికా శక్తి వస్తుందట. ఆ మూలిక ఏమిటో ఒక్క పాపారావుకే తెలుసట"

అదీ పాపారావు పాపపు ఆలోచన... అతని వ్యాపార రహస్యం...

రంగురంగుల రెక్కల సీతాకోక చిలుకలు గుర్తొచ్చి దుఃఖం వచ్చింది. ఎంతటి కిరాతకం... డబ్బు సంపాదన కోసం వాటి రెక్కల్ని కత్తిరించి, వాటిని పొడిగా మార్చి... ఆ ఆలోచనకే వళ్ళు జలదరిస్తోంటే అలా చేయడానికి వాళ్ళకు చేతులెలా వస్తున్నాయో...

యిప్పుడు మా తోటలోకి సీతాకోక చిలుకలు రావటంలేదు. కొన్ని రోజులు పోతే మా వూళ్లోనే అవి కన్పించవు. కొన్నాళ్ళు పోతే అసలు సీతాకోక చిలుకల జాతే అంతరించిపోయే ప్రమాదముంది.

మనుషుల్లోని బలహీనతల్ని, అజ్ఞానాన్ని ఆసరాగా తీసుకుని డబ్బు సంపాదన కోసం కొంత మంది స్వార్థపరులు ఆడుతున్న ఈ రాక్షస క్రీడలో అంతమైపోతున్న జీవ జాతులెన్నో... ఖడ్గమృగం కొమ్ములో మగవాళ్ళ పుంసత్వాన్ని పెంచే శక్తి ఉందన్న అపోహతో వాటిని వేటాడటం వల్ల ఆ జాతి సమూలంగా తుడిచిపెట్టుకుపోయే ప్రమాదం ఏర్పడింది. యిపుడు పాపారావు రాజేసిన నిప్పు కార్చిచ్చులా వ్యాపిస్తే అందమైన రెక్కల్తో ఎగిరే ఈ సీతాకోక చిలుకలు ముందు తరాలకు పుస్తకాల్లోనో, మ్యూజియాల్లోనో తప్ప సజీవంగా కన్పించవు.

ఆ క్షణమే నిర్ణయించుకున్నాను. మరలా మా తోటలోకి రకరకాల రంగురంగుల సీతాకోకచిలుకలు వచ్చే వరకు పాపారావులాంటి దుష్టులమీద దుర్మార్గులమీద అవిశ్రాంతమైన పోరు జరపాలని.

కుమార్తో నా ప్లాన్ చెప్పాను.

మరునాడు నేనూ కుమార్ కలిసి పాపారావు దగ్గరకెళ్ళాం. యాభై రూపాయలిచ్చాక ఆ ధూపాన్ని అక్కడే పీల్చాడు కుమార్.

మొదట కళ్ళు తిరుగుతున్నాయని చెప్పి కూచున్నవాడు మరునిముషంలో గిలగిలా కాళ్ళూ చేతులూ కొట్టుకుంటూ పడిపోయాడు. పాపారావు కంగారు పడిపోయి తనకు తెల్సిన ఉపచారాలేవో చేశాడు. ఐనా ఫలితం లేకపోయేప్పటికి "పెద్దాసుపత్రికి పిల్చుకెళ్ళటం మంచిది" అన్నారు గుమికూడిన జనంలోంచి కొంతమంది.

వాణ్ణి ఆటోలో వేసుకుని హాస్పిటల్కి పిల్చుకెళ్ళాను. కుమార్ వాళ్ళింటికి ఫోన్ చేసి కంగారు పడాల్సిన విషయమేమీ లేదని చెప్పాను.

సాయంత్రం హాస్పిటల్నించి కుమార్ని పిల్చుకు రావటమే ఆలస్యం జనాలందరూ మూగి "ఏమైంది? ఎందుకలా పడిపోయాడు? డాక్టరేమన్నాడు? పర్లేదన్నాడా? ప్రమాదమేమీ లేదన్నాడా?" లాంటి సవాలక్ష ప్రశ్నలడిగాడు.

"సీతాకోక చిలుకల రెక్కల్లో ఏదో విషపదార్థం ఉంటుందట.వాటిని కాల్చి పొగ పీల్చటం వల్ల కిడ్నీలు, లివర్ శాశ్వతంగా దెబ్బతింటాయట. మోతాదు మించితే మతి స్థిమితం కోల్పోయే ప్రమాదముందని డాక్టర్ చెప్పాడు. పాపారావు పైన పోలీస్ కంప్లెయింట్ యిస్తానన్నాడు. మనూరివాడు కదాని మేమే వద్దని బతిమాలుకున్నాం" అన్నాను.

"మరి మేంకూడా ఆ పొగని పీల్చాంగా... మాకేమీ కాలేదే" అన్నారు కొందరు.

ఈ ప్రశ్న వూహిస్తున్నదే కాబట్టి తయారుగా ఉంచుకున్న సమాధానం చెప్పాను. "యిదే ప్రశ్న డాక్టర్ని నేనూ అడిగాను. మనలో ఉన్న రోగనిరోధక శక్తి మీద ఆధారపడి ఉంటుందట. కుమార్కి ఆ శక్తి తక్కువ ఉండటం వల్ల వెంటనే విష ప్రభావం పన్చేసింది. మీలో రోగనిరోధక శక్తి కొద్దిగా ఎక్కువ ఉండబట్టి మీరు బతికి పోయారు. మీరైనా మరోసారి పీలిస్తే నష్టపోవటం మాత్రం ఖచ్చితంగా జరుగుతుందని డాక్టర్ చెప్పాడు."

ఈ వార్త దావానలంలా వూరంతా పాకిపోయింది. పాపారావు యింటి ముందు యింత క్రితం క్యూ కట్టిన వాళ్ళే అతన్ని పట్టుకుని నాలుగు తగిలించారు.

నేనతన్ని పోలీస్ కేస్ లేకుండా రక్షించినందుకు పాపారావు మా యింటికొచ్చి

నాకు కృతజ్ఞతలు తెలియచేశాడు.

నేను తృప్తిగా మరలా కాలేజీహాస్టల్ కెళ్ళిపోయాను.

మళ్ళా సంక్రాంతి శెలవలకని యింటికొచ్చినపుడు మాతోట నిండా రంగు రంగుల పూలు... వాటి అందాలకు ఏమాత్రం తీసిపోని రంగురంగుల రెక్కల్తో ఆ తోటలో విహరిస్తోన్న సీతాకోక చిలుకలు..వంద హరివిల్లులు ఒక్కసారిగా విరిసినట్లు... సౌందర్య నృత్య హేల.

**(ఆకాశవాణి, హైద్రాబాద్ కేంద్రం, మార్చి 2010)**

**(ప్రాణహిత అంతర్జాల పత్రిక, ఫిబ్రవరి 2010)**